
మరణంలోనూ మానవత్వం



లక్ష్మీదేవమ్మ (ఫైల్)

సనత్‌నగర్, మే 15(ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్‌కు గురైన మహిళ నుంచి జీవన్‌దాన్ సభ్యులు అవయవాలు సేకరించారు. మహబూబ్‌నగర్ జిల్లా వనపర్తికి చెందిన మేకల లక్ష్మీదేవమ్మకు(42) భర్త రాములు, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈనెల 5న కుమారుడితోపాటు లక్ష్మీదేవమ్మ బైక్‌పై వెళ్తుండగా గుర్తు తెలియని వాహనం ఢీ కొట్టింది. లక్ష్మీదేవమ్మకు తలకు తీవ్రగాయాలు కావడంతో ఆమెను పంజాగుట్ట నిమ్స్ ఆస్పత్రికి తరలించారు. వైద్యులు 9 రోజుల పాటు చికిత్స అందించినా స్పందించకపోవడంతో బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. జీవన్‌దాన్ సభ్యులు, లక్ష్మీదేవమ్మ కుటుంబసభ్యులకు అవయవదానంపై అవగాహన కల్పించి ఆమె నుంచి లివర్, 2 కిడ్నీలు, 2 కార్నియాలు సేకరించారు.

అనారోగ్యంతో గుర్తు తెలియని వ్యక్తి మృతి



అమీర్‌పేట, మే 15(ఆంధ్రజ్యోతి): తీవ్ర అనారోగ్యానికి గురై వైద్యం చేయించుకోలేని గుర్తు తెలియని వ్యక్తి(55) మంగళవారం రాత్రి బల్కంపేట ఎల్లమ్మ ఆలయం సమీపంలోని డివైడర్ వద్ద మృతి చెందాడు. ఎస్ఆర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటనకు సంబంధించి ఎస్ఐ అఖిల తెలిపిన వివరాల ప్రకారం... కొద్దిరోజుల క్రితం బల్కంపేటకు వచ్చిన వ్యక్తి స్థానికంగా భిక్షాటన చేసుకుంటూ రాత్రి వేళ ఆలయం సమీపంలోని డివైడర్‌పై పడుకునేవా వాడు. మంగళవారం ఉదయం నుంచి రాత్రి వరకు లేవకపోవడంతో గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే కారు-వన్ పెట్రోలింగ్ పోలీసులు వంటిపై చొక్కా కూడా లేకుండా నిర్జీవంగా పడి ఉన్న వ్యక్తిని తట్టి చూశారు. లేవక పోవడంతో 108కు సమాచారం ఇచ్చారు. సిబ్బంది వచ్చి పరిక్షించగా అప్పటికే మృతి చెందినట్టు నిర్ధారించారు. కేసు నమోదు చేసి పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించినట్టు ఎస్ఐ తెలిపారు.

పార్శిల్ దొంగను పట్టుకొని పోలీసులకు అప్పగింత

యూసుఫ్‌గూడ, మే 15(ఆంధ్రజ్యోతి): పార్శిల్ దొంగలించడానికి వచ్చిన వ్యక్తిని పట్టుకొని పోలీసులకు అప్పగించారు. పోలీసుల తెలిపిన వివరాల ప్రకారం.. సాయికుమార్ అమెజాన్‌లో డెలివరీ బాయ్. ఈ నెల 14న మధురానగర్‌లో పార్శిల్ డెలివరీ ఇచ్చాడు. పార్శిల్ ఇచ్చి తన వాహనం వద్దకు వచ్చేలోగ మహ్మద్ ఇర్ఫాన్ అనే వ్యక్తి రూ. 5000విలువ చేసే పార్శిల్ దొంగతనానికి ప్రయత్నించాడు. సాయికుమార్ అతడిని పట్టుకొని మధురానగర్ పీఎస్‌లో అప్పగించాడు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భార్యను హత్య చేసిన భర్తకు జీవిత ఖైదు

రంగారెడ్డి కోర్టులు, మే 15 (ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించి హతమార్చిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తూ న్యాయస్థానం బుధవారం తీర్పు చెప్పింది. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వొద్యారపు రవికుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం జిల్లా, కూసుమంచి మండలం, మల్లయ్యగూడెంకు చెందిన బెక్కా సందీప్ వివాహం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొల్తాండకు చెందిన రాణితో జరిగింది. వీరికి ఇద్దరు సంతానం. అదనపు కట్నం కోసం సందీప్ రాణిని వేధిస్తున్నాడు. రాణి తల్లిదండ్రులు పెద్దల సమక్షంలో అతడికి నచ్చజెప్పారు. సందీప్ రాణి సాహెబ్‌నగర్‌కు మకాం మార్చారు. అయినప్పటికీ సందీప్‌లో మార్పు రాలేదు. 2018 ఫిబ్రవరి 28వ తేదీ రాత్రి సందీప్ రాణితో గొడవపడి రోకలిబండతో తలపై బాదడంతో మృతి చెందింది. మృతురాలి తల్లి వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. కేసును విచారించిన న్యాయమూర్తి జయప్రసాద్ నిందితుడు సందీప్‌కు జీవిత ఖైదు, రూ. 3 వేల జరిమానా విధిస్తూ తీర్పు చెప్పారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి



ఘటనా స్థలంలో మృతుడు తేజా

అబ్దుల్లాపూర్‌మెట్, మే 15 (ఆంధ్రజ్యోతి): ప్రమాదవశాత్తు తాటిచెట్టు పై నుంచి జారిపడి గీత కార్మికుడు మృతి చెందాడు. నల్లగొండ జిల్లా, చింతపల్లి మండలం, సాయిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన గండేటి తేజా(50) భార్య సంతోష, ముగ్గురు పిల్లలతో అబ్దుల్లాపూర్‌మెట్ మండలం, మజీద్‌పూర్ గ్రామంలో ఇందిరమ్మకాలనీలో నివసిస్తూ గీతకార్మికుడిగా జీవనం సాగిస్తున్నాడు. బుధవారం ఉదయం బాలసింగారం పరిధిలోని దొడ్డ శాంతికుమార్ వ్యవసాయ భూమిలో కల్లు, ముంజలు తీసేందుకు తాటి చెట్టు ఎక్కాడు. ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి జారి కిందపడ్డాడు. తీవ్రమైన గాయాలవడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సమాచారం అందుకున్న అబ్దుల్లాపూర్‌మెట్ పోలీసులు మృతదేహాన్ని ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుడి భార్య సంతోష ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధుడి అదృశ్యం

పేట్‌బషీరాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన వృద్ధుడు తిరిగి రాలేదు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన శివరాజ్(67) ఈనెల 6న నగర శివారులోని గుండ్లపోచంపల్లిలోని కుమారుడు వద్దకు వచ్చాడు. ఈనెల 10న ఇంట్లో ఎవరూ లేని సమయంలో బయటకు వెళ్లిన శివరాజ్ తిరిగి రాలేదు. కుటుంబసభ్యులు బంధువులు, చుట్టు ప్రక్కల వెతికినా అతడి ఆచూకీ లభించలేదు. దీంతో ఆయన కుమారుడు బుధవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ ప్రవీణ్ తెలిపారు.

బీఆర్ఎస్ నాయకుడిపై దాడిచేసిన వారిపై కేసు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డిపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్ కుమారులపై కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం సెయింట్ పాయిస్ స్కూల్ వద్దకు కొండా శ్రీధర్‌రెడ్డిని రమ్మని మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి, ఎడ్ల హరిబాబుయాదవ్ దంపతుల కుమారులు అభినయ్‌యాదవ్, వరుణ్‌యాదవ్, సాయియాదవ్ పిలిచారు. శ్రీధర్‌రెడ్డి వెళ్లగానే వారితోపాటు మరికొంతమంది ఆయనపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అభినయ్ యాదవ్, వరుణ్ యాదవ్, సాయియాదవ్‌తోపాటు మరికొందరిపై పలు సెక్షన్‌ల కింద బుధవారం కేసు నమోదు చేశారు.

కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై బీజేపీ నాయకుడు ముషీరాబాద్ పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత 5.30 గంటల సమయంలో భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో ఉంటున్న బీజేపీ నాయకుడు గోకారం లక్ష్మణ్ ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హరిహరకళాక్షేత్రం వద్ద బీఆర్ఎస్ నాయకుడు సతీష్ లక్ష్మణ్‌ను పిలిచి కులం పేరుతో అకారణంగా దుర్భాషలాడాడు. బాధితుడు పోలీసులకు బుధవారం ఫిర్యాదు చేశాడు.

మేడ్చల్ ఆర్టీసీ కాలనీలో దొంగతనాలు

మేడ్చల్ టౌన్, మే 15 (ఆంధ్రజ్యోతి): మేడ్చల్ పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని ఓ కిరాణ దుకాణంతో పాటు పలు ఇళ్లల్లో దొంగతనాలకు పాల్పడిన ఘటన మంగళవారం రాత్రి చోటు చేసుకుంది. స్థానికులు ఇచ్చిన సమాచారం మేరకు పట్టణంలోని ఆర్టీసీ కాలనీలోని ఒక కిరాణ దుకాణంలో చొరబడి నగదు దొంగలించగా అదే కాలనీలో అద్దెకు ఉంటున్న పలువురి ఇళ్లల్లో దొంగతనాలు జరిగాయి, కాగా, దొంగతనాలు జరిగిన ఇంటి యజమానులు తమ సొంతూర్లకు వెళ్లటంతో చుట్టపక్కల వారు చేసిన ఫిర్యాదు మేరకు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. దొంగతనాలకు గురైన ఇంటి యజమానులకు సమాచారం ఇచ్చామని, వారు వచ్చిన అనంతరం దొంగలించబడిన నగదు, బంగారం ఇతర వస్తువుల వివరాలు తెలుస్తాయని పోలీసులు తెలిపారు. కిరాణా దుకాణంలో రూ. 15వేల నగదు దొంగలించబడ్డాయని దుకాణం యజమాని ఫిర్యాదు చేసినట్టు పోలీసులు వెల్లడించారు.

'ఫ్లాట్ల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి'

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లలో ఫ్లాట్‌ల కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. బుధవారం సాయంత్రం గోల్కొండచౌరస్తాలో మండలి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వరంగల్ భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం జరిగినవి, జరుగుతున్న ఫ్లాట్లను కొనుగోలు చేయడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వరంగల్ భద్రకాళిచెరువు పరిరక్షణ విషయంలో వినియోగదారుల మండలి ఇప్పటికే న్యాయస్థానాల్లో ఫిర్యాదులను దాఖలు చేసిందన్నారు. ఇటీవల బాచుపల్లి ప్రాంతంలో కోమటికుంట చెరువును ఆక్రమించుకుని నిర్మాణం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై హైకోర్టు చెరువులో అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం తెలిపిందని పేర్కొన్నారు. ఈ విషయమై వినియోగదారుల మండలి పక్షాన కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

నత్తనడకన ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు

- రియల్టర్లతో కుమ్మక్కు
- అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

హైదరాబాద్ సిటీ, మే 15(ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా, వాటర్‌బోర్డు నిర్ణయాలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. రియల్టర్లతో కుమ్మక్కై శివారు ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లలో కూడా పైపులైన్లు వేస్తున్నారు. గత ప్రభుత్వం ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని అందించే బాధ్యతలను వాటర్‌బోర్డుకు అప్పగించింది. ఓఆర్ఆర్ ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా రూ.756 కోట్లతో కొంతమేరకు పనులు పూర్తయ్యాయి. ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా రూ. 1200 కోట్లతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి అందించే పనులను 2022లో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా 73 సర్వీసు రిజర్వాయర్లు (138 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2988 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ నిర్మించాల్సి ఉంటుంది. ప్యాకేజ్-1లో రూ. 613.14 కోట్లతో 1571 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ వేయడంతో పాటు 65.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 34 రిజర్వాయర్ల నిర్మాణం చేయాలని, ప్యాకేజ్-2లో రూ.586.86 కోట్లతో 1094 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ, 36 రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబర్ వరకు పనులు పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్ణయించగా ఆరు నెలలు గడుస్తున్నా కనీసం 70శాతం కూడా పూర్తవ లేదు. పూర్తిస్థాయిలో సర్వీసు రిజర్వాయర్లు అందుబాటులోకి రాలే దు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు సైతం స్పష్టతనివ్వడం లేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో 73 రిజర్వాయర్లకు 35 మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మాణం చేసినట్లు తెలిసింది. మిగతా 38రిజర్వాయర్ల పనులు సాగుతున్నాయి. 90శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. మొత్తం 2988 కిలోమీటర్ల పైపులైన్‌కు గానూ 2032 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. 956 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. తాగునీటి సరఫరా పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నా రు. పనులు పూర్తి చేయడానికి నిర్మాణ ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.

అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా శివారులోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీల్లో 2988 కిలోమీటర్ల పైపులైన్ వేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 2150 కిలోమీటర్ల మేర పైపులైన్ మాత్రమే పూర్తి చేశారు. ఇంకా 800కు పైగా కిలోమీటర్ల పైపులైన్ వేయాల్సి ఉంది. ఇప్పటివరకు నిర్మాణం జరిగిన పైపులైన్ పనుల్లో భారీగా డొల్లతనం ఉన్నట్లు తెలిసింది. నివాసాలు కలిగిన ప్రాంతాల్లోనే పైపులైన్లు వేసి నీటిని అందించే విధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు భిన్నంగా ప్రాజెక్టు విభాగంలోని కొందరు అధికారులు, ఏజెన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరించినట్టు సమాచారం. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ లేఅవుట్‌లో ఇళ్లు లేకపోయినా పైపులైన్లు వేసినట్టు తెలిసింది. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ప్రాంతంలో లేఅవుట్ యజమానులకు మేలు చేసేలా పైపులైన్లు వేశారు. ఘట్‌కేసర్, కీసర, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రియల్టర్లతో కొందరు అధికారులు కుమ్మక్కై ఇష్టానుసారంగా పైపులైన్లు వేసినట్లు తెలిసింద. ఇటీవల ఏసీబీకి చిక్కకుండా తృటిలో తప్పించుకున్న వాటర్‌బోర్డులోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్టు సమాచారం. వాటర్‌బోర్డు ఎండీ మారడం, కొత్తగా మరో ఎండీ రావడంతో ఇదే అదనుగా భావించి ఎన్నికల సమయంలోనే ఈ తతంగాన్ని సాగించినట్టు తెలిసింది. కొత్తగా వచ్చిన ఎండీ ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టును పరిశీలన చేసే లోపు అక్రమాలు జరిగినట్టు బోర్డులో గుసగుసలు వినిపిస్తున్నాయి.



శివారులోని ఓ ప్రాంతంలో నిలిచిన పైపులైన్ పనులు

ఈ పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలి



రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్ శివశంకర్‌కు వినతిపత్రం అందజేస్తున్న బహుజన టీచర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

పంజాగుట్ట, మే 15(ఆంధ్రజ్యోతి): ఈ పీఆర్సీలో 45శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని బహుజన టీచర్స్ అసోసియేషన్(బీటీఏ)విజ్ఞప్తి చేసింది. అసోసియేషన్ ప్రతినిధులు బుధవారం బీఆర్కేఆర్ భవన్‌లో రెండో పీఆర్సీ కమిషన్ చైర్మన్ ఎన్.శివశంకర్, సభ్యులను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ అధ్యక్షుడు కల్వదర్శి చైతన్య, గౌరవ అధ్యక్షుడు వి.బాలపీర్ మాట్లాడుతూ... పీఆర్సీలో 45 శాతం ఫిట్‌మెంట్ ఇవ్వాలని పీఆర్సీ కమిషన్ చైర్మన్, సభ్యులను కోరామన్నారు. లాంగ్వేజ్ పండితులకు, ఎస్జీటీలు ఉన్నత తరగతుల బోధనకై అదనపు అలవెన్స్‌ను కనీసం రూ.1200 ఇవ్వాలని కోరారు. కాంప్లెక్స్ హెడ్‌మాస్టర్లు అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నందున వారికి మంచి అలవెన్స్ ఇవ్వాలని, జీఐఎస్ స్లాబ్లను ఏ-గ్రూపు రూ.1200, బి-గ్రూప్ రూ.900, సి-గ్రూపు రూ.600, డి-గ్రూప్ రూ. 300 ఇవ్వాలని, సంపాదిత సెలవులను సంవత్సరానికి 10 రోజులకు తగ్గకుండా పెంచాలని అన్నారు. ఉపాధ్యాయుల కర్మకాండలకు కనీసం ఐదు రోజులు సెలవులు ఇస్తూ ఖర్చుల నిమిత్తం రూ. 50 వేలు ఇవ్వాలని, గ్రాట్యుటీని రూ. 22లక్షలకు పెంచాలన్నారు. తమ విజ్ఞప్తి పట్ల కమిటీ సభ్యులు సానుకూలంగా స్పందించారని వారు తెలిపారు. అసోసియేషన్ ఉపాధ్యక్షుడు, పీఆర్సీ నివేదిక సంఘం ఇన్‌చార్జి ఎం.విజయ్ కుమార్, తదితరులు వారి వెంట ఉన్నారు.

కస్తూర్బా అకౌంటెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించడి



సర్వశిక్షా అభియాన్ ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిసిన కేజీబీవీ అకౌంటెంట్ ఉద్యోగులు

ఖైరతాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): కస్తూర్బా విద్యాలయాల్లో పని చేస్తున్న అకౌంటెంట్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరింపజేయాలని కోరుతూ ఉద్యోగులు ప్రాజెక్టు డైరెక్టర్‌ను కలిశారు. బుధవారం ప్రోగ్రెస్సివ్ కేజీబీవీ నాన్ టీచింగ్ వర్కర్స్ అసోసియేషన్ (ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో అధ్యక్షురాలు ఎస్ఎల్ పద్మ, ప్రధాన కార్యదర్శి పి.అరుణ్‌కుమార్ నేతృత్వంలో ఉద్యోగులు ఆయనను సైఫాబాద్‌లోని కార్యాలయంలో కలిశారు. అకౌంటెంట్లకు, నాన్ టీచింగ్ సిబ్బందికి నైట్ డ్యూటీలు, హాలిడే డ్యూటీలు చేయించాలనే ఆలోచనను విరమించుకోవాలని కోరారు. అకౌంటెంట్లకు, సీఆర్‌టీ ఉద్యోగులకు గతంలో జీతాల పెంపుదలలో తక్కువ వ్యత్యాసం ఉండేదని, అది ప్రస్తుతం 10వేలకు పెరిగిందని, అకౌంటెంట్లకు వేతనాలు పెంచాలని కోరారు. అకౌంటెంట్లకు పని సమయం ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు ఉండేలా చూడాలని కోరారు. పీడీని కలిసిన వారిలో సంఘం ప్రతినిధులు ప్రవీణ, చంద్రకళ, వసంత, సరిత తదితరులు ఉన్నారు.

ఒంటె బలిపీఠం ప్రతిష్ఠాపన



ఒంటే బలిపీఠాన్ని ప్రతిష్ఠిస్తున్న దాతలు వంశీ మోహన్ రెడ్డి, శోభా రెడ్డి తదితరులు

ఎర్రగడ్డ, మే 15(ఆంధ్రజ్యోతి): హెమవతి నగర్‌లోని ప్రసన్నాంజనేయ స్వామి ఆలయంలో ఆంజనేయస్వామి వాహనమైన ఒంటె బలిపీఠాన్ని బుధవారం ప్రతిష్ఠించారు. దాతలు డీఎస్పీ చింతపల్లి వంశీ మోహన్‌రెడ్డి, చింతపల్లి శోభా రెడ్డి సహకారంతో ప్రతిష్ఠాపన కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయ కమిటీ అధ్యక్షుడు గూడూరి చెన్నారెడ్డి మాట్లాడుతూ... దాతల సహాయంతో దేవాలయంలో పలు అభివృద్ధి పనులు చేపడుతున్నట్టు తెలిపారు. ఆలయంలో కొన్ని వాస్తు దోషాలు కలిగి ఉన్న కారణంగా వాటిని సరిదిద్దాల్సిన అవసరం ఉందని, కమిటీ సహకారంతో ఆ మార్పులు త్వరలోనే చేపడతామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో సాయి కనిష్కరెడ్డి, లిసా వంశీరెడ్డి, జి. తాన్యరెడ్డి, దేవాలయ పండితులు పాల్గొన్నారు.

డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రెహమాన్‌కు పీహెచ్‌డీ



ఎర్రగడ్డ, మే 15 (ఆంధ్రజ్యోతి): పశుసంవర్ధక శాఖ అదనపు డైరెక్టర్, ఆంధ్రప్రదేశ్ మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌లో వైస్ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కి పీహెచ్‌డీ లభించింది. హైదరాబాద్ ఉస్మానియా యూనివర్సిటీ డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్‌కు పీహెచ్‌డీని అందజేసింది. అనలిటికల్ స్టడీ ఆఫ్ అనిమల్స్ మెన్షండ్ ఇన్ ది హోలీ ఖురాన్ ఇన్ ద లైట్ ఆఫ్ వెటర్నరీ సైన్సెస్ అనే అంశంపై చేసిన పరిశోధనకు గాను యూనివర్సిటీ ఈ గౌరవ పీహెచ్‌డీ అందజేసింది. ఉస్మానియా యూనివర్సిటీ అరబీ భాషా విభాగపు అధిపతి ప్రొఫెసర్ మహాసబిన్ అత్తర్ పర్యవేక్షణలో ఈ పరిశోధన కొనసాగింది. పవిత్ర ఖురాన్‌లో పేర్కొన్న వెటర్నరీ సైన్స్ ప్రాముఖ్యత, ప్రయోజనాలు, ఉద్దేశాన్ని వివరిస్తూ ఒక పరిశోధన పత్రాన్ని డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ ప్రచురించారు. ఇటువంటి అంశంపై భారత దేశంలోని ఇది మొట్టమొదటి ప్రచురణగా ప్రసిద్ధిగాంచింది. ఈ సందర్భంగా డాక్టర్ మహమ్మద్ అబ్దుల్ రహమాన్ మాట్లాడుతూ... తాను పొందిన ఈ పీహెచ్‌డీతో మరిన్ని విజయాలు సాధించడానికి స్ఫూర్తి కలిగిందన్నారు.



సైఫాబాద్‌లో ద్విచక్ర వాహనాలను అదుపులోకి తీసుకున్న పోలీసులు

నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై స్పెషల్ డ్రైవ్

ఖైరతాబాద్, మే 15(ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్లు సరిగ్గా లేని వాహనాలపై పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహిస్తూ వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నారు. బుధవారం సైఫాబాద్ పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి నంబరు కనిపించకుండా చేసినవారిని, నిబంధనలకు విరుద్ధంగా నంబర్ ప్లేట్లు లేనివారిని అదుపులోకి తీసుకొని కొందరికి జరిమానాలు వేసి మరికొందరికి అవగాహన కల్పించారు. ఇకపై ఇలాంటి డ్రైవ్‌లు తరచూ ఉంటాయని ఎస్ఐ సురేష్‌రెడ్డి తెలిపారు.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ

రాంనగర్, మే 15(ఆంధ్రజ్యోతి): బీసీల కులగణన చేసి పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో 50శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్. కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బుధవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలోని వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు 22 శాతం నుంచి 42శాతానికి పెంచుతామని ప్రకటించిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

రేతిఫైల్ స్టాండ్ వద్ద బస్సులు ఆపాలి

రెజిమెంటల్‌బజార్, మే 15(ఆంధ్రజ్యోతి): రేతిఫైల్ బస్టాండ్ మీదుగా జూబ్లీ బస్టాండ్ వెళ్లే బస్సులను రేతిఫైల్ బస్ కాంప్లెక్స్ వద్ద ఆపకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న బస్ షెల్టర్‌లలో దిగి వెనుక్కి రావాల్సివస్తోంది. కొంత మంది రన్నింగ్‌లో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ బస్సులు ఆపడం వల్ల రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు బస్సు దిగి నేరుగా ప్లాట్‌ఫామ్ ఒకటి మీదకు చేరుకునే అవకాశం ఉంది. రేతిఫైల్ బస్ స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు జూబ్లీ బస్టాండ్ వెళ్లడానికి, ఈస్ట్ మెట్రో స్టేషన్ వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది.

నృత్యకళాకారిణికి మహాబలి పురస్కారం

చిక్కడపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): నగరానికి చెందిన ప్రముఖ నృత్యకళాకారిణి స్నేహరామ్‌చందర్‌కు సాంస్కృతిక, సేవారంగాలకు చేసిన సేవలకు గుర్తింపుగా ప్రతిష్ఠాత్మక మహాబలి పురస్కారం లభించింది. ఇండోనేషియాలో బాలి విశ్వవిద్యాలయంలో సంగమం గ్లోబల్, ఇండియన్ కౌన్సిల్ ఫర్ కల్చరల్ రిలేషన్స్(ఐసీసీఆర్), బాలి విశ్వవిద్యాలయం సంయుక్తంగా ఇటీవల నిర్వహించిన నృత్యోత్సవంలో స్నేహ రామ్‌చందర్ ఈ పురస్కారాన్ని బాలి నగరానికి చెందిన రాజు డా. అరివేదకర్ల చేతుల మీదుగా అందుకున్నారు. కార్యక్రమంలో నిర్వాహక సంస్థల ప్రతినిధులు నవీన్, డా. ఎన్ పంచనాథమ్ తదితరులు పాల్గొన్నారు. స్నేహరామ్‌చందర్ భారతదేశంలో లెప్రా సొసైటీకి రాయబారిగా ఉండి సేవా కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొంటున్నారు.

కైవల్య యర్రం శెట్టికి ఉగాది పురస్కారం

చిక్కడపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): కథక్ నృత్యకళాకారిణి కైవల్య యర్రం శెట్టికి ఉగాది పురస్కారం లభించింది. రసమయి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయగానసభలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఉగాదిపురస్కారాల ప్రదానసభలో ప్రముఖ నాట్యగురువు పండిట్ అంజిబాబు శిష్యురాలైన కైవల్య యర్రంశెట్టి కథక్ నృత్యాన్ని ప్రదర్శించారు. కైవల్యకు ఉగాది పురస్కారాన్ని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ బహూకరించి ఆశీర్వదించారు.

చిక్కా దేవదాసుకు సహస్ర సేవా ధురీణ బిరుదు..

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): చేనేతవర్గాల చైతన్యవేదిక జాతీయ అధ్యక్షుడు, సమాజ సేవకుడు డా. చిక్కా దేవదాసుకు సహస్ర సేవా ధురీణ బిరుదు ప్రదానం చేశారు. కళానిలయం సంస్థ ఆధ్వర్యంలో బుధవారం సాయంత్రం త్యాగరాయ గానసభలో నిర్వహించిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న వెంకటేశ్వర యూనివర్సిటీ మాజీ వీసీ ఆచార్య కొలకలూరి ఇనాక్ మాట్లాడుతూ.. దేవదాసు ఆధ్యాత్మిక రంగంలో సేవలు అందిస్తూనే చేనేత కార్మికుల సంక్షేమానికి పాటుపడడం విశేషమన్నారు. ఈసందర్భంగా పలువురికి చిక్కా దేవదాసు ప్రతిభా పురస్కారాలు ప్రదానం చేశారు. పోలీస్ శాఖ పూర్వ ఉన్నతాధికారి సుంకర సత్యనారాయణ, ప్రముఖ కవి చిక్కా రామదాసు, చందు ఆంజనేయులు, బద్రినాథ్, నిర్వాహకులు సురేందర్ పాల్గొన్నారు.

నేడు సివిల్స్ పరీక్షలపై అవగాహన సదస్సు

చిక్కడపల్లి, మే 15(ఆంధ్రజ్యోతి): సివిల్స్ పరీక్షలకు సిద్ధమవుతున్న అభ్యర్థుల గురువారం ఉచిత అవగాహన సదస్సు నిర్వహిస్తున్నారు. ఆర్టీసీక్రాస్‌రోడ్‌లో విజన్ ఐఏఎస్ కోచింగ్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఉచిత సదస్సులో 2023 ఆలిండియా 27వ ర్యాంకర్ నందల సాయికిరణ్ అభ్యర్థులకు సివిల్స్ ప్రిపరేషన్, ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ అంశాలపై వివరిస్తారు. అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

రాత్రివేళ.. రోడ్డుపై..

ఖైతలాపూర్‌లో అసాంఘిక కార్యక్రమాలు

ఇబ్బందిపడుతున్న వాహనదారులు, పాదచారులు

- మూడు రోజుల క్రితం ఖైతలాపూర్‌లోని గ్రీన్‌హిల్స్ రోడ్డులోని 15వ ఫేజ్ ప్రాంతానికి బేగంపేట నుంచి నలుగురు యువకులు వచ్చారు. వీరికి వ్యభిచార నిర్వాహకులకు మధ్య లావాదేవీల్లో తేడాలు రావడంతో గొడవ జరిగింది. ముగ్గురు యువకులు పారిపోగా... ఓ యువకుడు అక్కడే ఉండడంతో వ్యభిచార నిర్వాహకులు అతని దుస్తులు విప్పి రోడ్డుపై కూర్చోపెట్టారు.
- ఖైతలాపూర్, కేపీహెచ్‌బీకాలనీ 15వఫేజ్, లోధా అపార్ట్‌మెంట్స్ సమీపంలో వ్యభిచార కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. అందంగా తయారై రహదారుల పక్కన నిల్చుండడంతో అటువైపుగా వెళ్లే వాళ్లు అక్కడ ఆగి వారితో సంప్రదింపులు జరుపుతున్నారు. నగదు లావాదేవీల విషయంతో తరచూ గొడవలు చోటు చేసుకొంటున్నాయి.

కూకట్‌పల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): హైటెక్‌సిటీకి కూత వేటు దూరంలో ఉన్న ఆ రహదారిపై రాత్రి వేళ రాకపోకలు సాగించాలంటే ఐటీ ఉద్యోగులు, వ్యాపారస్తులు, ప్రజలకు వణికి పోతున్నారు. చీకటి పండిందంటే చాలు.. మందుబాబుల ఆగడాలు మితిమీరిపోతున్నాయి. దీనికితోడు హౌసింగ్‌బోర్డు విభాగానికి చెందిన నిర్మానుష ప్రాంతం ఉండడంతో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డాగా మారింది. దీంతో వ్యభిచారం సైతం కొనసాగుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇదే అదునుగా మందుబాబులు మద్యం తాగుతూ రోడ్లపై యథేచ్ఛగా తిరుగుతూ వాహనదారులతో గొడవలు పడి కొట్లాటలకు పాల్పడుతున్నారు. ఆ ప్రాంతంలో వ్యభిచారం జరుగుతున్నట్లు ప్రచారం కావడంతో నగరంలోని వివిధ ప్రాంతాలకు చెందిన యువకులు అర్ధరాత్రిళ్లు బైక్‌లపై వచ్చి న్యూసెన్స్ సృష్టిస్తున్నారు. ఇంత జరుగుతున్నా.. పోలీసులు మాత్రం అటువైపు కన్నెత్తి చూడడంలేదనే ఆరోపణలు వస్తున్నాయి. అదే ఖైతలాపూర్ సిగ్నల్ నుంచి హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ వరకు ఉన్న గ్రీన్‌హిల్స్ రహదారి.

మూసాపేట చౌరస్తా నుంచి హైటెక్‌సిటీ రైల్వేస్టేషన్ వరకు సులభంగా రాకపోకలు సాగించేందుకు జీహెచ్ఎంసీ ఆధ్వర్యంలో గ్రీన్‌హిల్స్ పేరుతో రహదారిని అందుబాటులోకి తీసుకొచ్చింది. ఈ మార్గంలో వేలాదిమంది ఐటీ ఉద్యోగులు, నైట్ డ్యూటీ ఉద్యోగులు, వ్యాపారులు రాత్రింబవళ్లు రాకపోకలు కొనసాగిస్తుంటారు. ఈ రహదారికి ఆనుకొని హౌసింగ్‌బోర్డుకు చెందిన వందలాది ఎకరాల ఖాళీ స్థలం ఉంది. ఇదే అదునుగా భావించిన కొందరు అక్కడ వ్యభిచారం నిర్వహిస్తున్నారు. కొందరు రోడ్డు పక్కన నిల్చొని యువకులను ఆకట్టుకొనేలా వ్యవహరిస్తున్నారు. విటులతో మాట్లాడుకొని నిర్మానుష ప్రాంతంలోకి తీసుకెళ్తున్నారు. ఈ రహదారిపై రాత్రిళ్లు మద్యం బాబులు స్థానికంగా న్యూసెన్స్ సృష్టిస్తున్నారన్నారు.



పట్టించుకోని పోలీసులు

కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఖైతలాపూర్ ప్రాంతంలో అసాంఘిక కార్యక్రమాలు, మందుబాబుల ఆగడాలు జరుగుతున్నాయి. వీరిపై పోలీసులు ఎటువంటి చర్యలూ తీసుకోవడంలేదు. పోలీసు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించి.. అసాంఘిక కార్యక్రమాలు అడ్డుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రత్యేక డ్రైవ్ కొనసాగిస్తాం..



ఖైతలాపూర్ ప్రాంతంలో కొనసాగుతున్న అసాంఘిక కార్యక్రమాల విషయం మా దృష్టికి వచ్చింది. ఇప్పటికే పలువురిపై కేసులు నమోదు చేశాం. ఈ రోజు నుంచి ఖైతలాపూర్, 15ఫేజ్, డంపింగ్ యార్డు రోడ్డులో సమస్య తీవ్రంగా ఉన్న నేపథ్యంలో సిబ్బంది రాత్రిళ్లు ఎక్కువ సమయం అక్కడే ఉండేలా ఆదేశిస్తా. ప్రత్యేక డ్రైవ్ కొనసాగించి పూర్తిస్థాయిలో అసాంఘిక కార్యక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం.

- కృష్ణమోహన్, కూకట్‌పల్లి ఇన్‌స్పెక్టర్



అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న సనత్‌నగర్ కాంగ్రెస్ ఇన్‌చార్జి డా.కోటనీలిమ, సీనియర్ నాయకులు మల్లికార్జున్, డాక్టర్ శివకుమార్

ఉజ్జయిని మహాకాళి దేవస్థానంలో ప్రత్యేక పూజలు

రాంగోపాల్‌పేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ ఉజ్జయిని మహాకాళి దేవస్థానంలో అమ్మవారికి ఏఐసీసీ సభ్యురాలు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో రాంగోపాల్‌పేట్ కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు మల్లికార్జున్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు డాక్టర్ శివకుమార్ లాల్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో వరప్రసాద్ రెడ్డి, రాయుడు, సింగ్ తదితరులు

రైల్వే పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

చిలకలగూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): రైల్వే పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ పెన్షనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జీ.వీ.ఎస్.రాయుడు డిమాండ్ చేశారు. చిలకలగూడలో బుధవారం అసోసియేషన్ సమావేశం నిర్వహించారు. రైల్వే పెన్షనర్లకి మెరుగైన వైద్య సౌకర్యాలు కల్పించాలని, స్థంభించిన మూడు కరువు భత్యం బకాయిలు వెంటనే చెల్లించాలని, డిసెంబర్, జూన్ నెలలలో పదవీ విరమణ చేసిన వారికి ఇంక్రిమెంట్ ఇవ్వాలని, ఏడవ వేతన సంఘం అములులో అవకతవకలు సవరించాలని కోరారు. ఈ సమావేశంలో వరప్రసాద్‌రెడ్డి, విద్యాసాగర్, బీ.కే.సింగ్, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

భార్యను హతమార్చిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా

రంగారెడ్డి కోర్టులు, మే 15(ఆంధ్రజ్యోతి): అదనపు కట్నం కోసం భార్యను వేధించి హతమార్చిన భర్తకు జీవిత ఖైదు, జరిమానా విధిస్తు అదనపు జిల్లా కోర్టు న్యాయమూర్తి వై.జయప్రసాద్ బుధవారం తీర్పు చెప్పారు. అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ వొద్యారపు రవికుమార్ కథనం ప్రకారం.. ఖమ్మం జిల్లా కుసుమంచి మండలం మల్లయ్యగూడెంకు చెందిన బెక్కా సందీప్ వివాహం సూర్యాపేట జిల్లా అనంతగిరి మండలం గొల్తాండకు చెందిన రాణితో జరిగింది. వివాహం అనంతరం కొంతకాలం వారి సంసారం సంతోషంగా సాగింది. తర్వాత సందీప్ రాణిని అదనపు కట్నం కోసం వేధించసాగాడు. దీంతో రాణి తల్లి దండ్రులు పెద్దల సమక్షంలో నచ్చచెప్పారు. సందీప్ రాణీలు తమ సంసారాన్ని సాహెబ్‌నగర్‌కు మార్చారు. వారికి ఇద్దరు సంతానం కలిగారు. అయినప్పటికీ సందీప్‌ఎలో మార్పు రాలేదు. 2018 ఫిబ్రవరి 28న రాత్రి సందీప్ రాణితో గొడవపడి రోకలిబండతో తలపై బాదాడు. దీంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న రాణి తల్లి అజ్మీరా మస్రు కూతురి ఇంటికి వచ్చింది. రక్తం మడుగులో పడి ఉన్న రాణి మృతదేహాన్ని చూసి బోరున విలపిస్తు వనస్థలిపురం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకున్న పోలీసులు సాక్ష్యాధారాలు సేకరించి కోర్టులో చార్జిషీటు దాఖలు చేశారు. సాక్షులను విచారించిన న్యాయమూర్తి జయప్రసాద్ నిందితుడికి జీవితఖైదుతో పాటు రూ. 3 వేల జరిమానా విధిస్తు తీర్పు ఇచ్చారు.

బీఆర్ఎస్ నాయకుడిపై దాడిచేసిన వారిపై కేసు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ముషీరాబాద్ డివిజన్ అధ్యక్షుడు కొండా శ్రీధర్‌రెడ్డిపై దాడి చేసిన మాజీ కార్పొరేటర్ కుమారులపై కేసు నమోదైంది. లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13వ తేదీ మధ్యాహ్నం సెయింట్ పాయిస్ స్కూల్ వద్దకు కొండా శ్రీధర్‌రెడ్డిని రమ్మని మాజీ కార్పొరేటర్ ఎడ్ల భాగ్యలక్ష్మి, ఎడ్ల హరిబాబు యాదవ్ దంపతుల కుమారులు అభినయ్‌యాదవ్, వరుణ్‌యాదవ్, సాయియాదవ్ పిలిచారు. శ్రీధర్‌రెడ్డి వెళ్లగానే వారితోపాటు మరికొంతమంది ఆయనపై దాడి చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు అభినయ్ యాదవ్, వరుణ్ యాదవ్, సాయియాదవ్‌తోపాటు మరికొందరిపై పలు సెక్షన్‌ల కింద బుధవారం కేసు నమోదు చేశారు.

కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై ఫిర్యాదు

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో కులం పేరుతో దూషించిన బీఆర్ఎస్ నాయకుడిపై బీజేపీ నాయకుడు ముషీరాబాద్ పీఎస్‌లో బుధవారం ఫిర్యాదు చేశాడు. ఈ నెల 13వ తేదీ సాయంత్రం పోలింగ్ ముగిసిన తర్వాత 5.30 గంటల సమయంలో భోలక్‌పూర్ డివిజన్ మహాత్మానగర్‌లో ఉంటున్న బీజేపీ నాయకుడు గోకారం లక్ష్మణ్ ఇంటికి వెళ్తున్నారు. మార్గమధ్యలో హరిహరకళాక్షేత్రం వద్ద బీఆర్ఎస్ నాయకుడు సతీష్ లక్ష్మణ్‌ను పిలిచి కులం పేరుతో అకారణంగా దుర్భాషలాడాడు. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.



పోలీసులు స్వాధీనం చేసుకున్న వాహనాలు

నంబర్ ప్లేట్లు లేని వాహనదారులపై కేసు

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): నంబర్ ప్లేట్లు లేని వాహనాలపై తిరుగుతున్న వారిని పోలీసులు పట్టుకుని వారిపై కేసులు నమోదు చేశారు. ఈ సందర్భంగా చిక్కడపల్లి ఇన్‌స్పెక్టర్ సీతయ్య మాట్లాడుతూ.. నంబర్ ప్లేట్ లేకుండా వాహనాలను నడిపితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సమస్యల వలయంలో మెక్లోడ్‌గూడ పార్కు

ఎటు చూసినా చెత్తచెదారం, మందు సీసాలు



రాంగోపాల్‌పేట్, మే 15 (ఆంధ్రజ్యోతి): అసలే నగరంలో పిల్లలు ఆడుకోవడానికి క్రీడా మైదానాలు కరువవుతున్నాయి. ప్రభుత్వం ఉన్నా క్రీడామైదానాలను గాలికి వదిలేస్తుంది. సనత్‌నగర్ నియోజకవర్గ పరిధిలోని రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో గల మెక్లోడ్‌గూడలోని క్రీడా ప్రాంగణం దుస్థితి ఇది. మెక్లోడ్‌గూడ, చుట్టాల బస్తీ, నల్లగుట్ట ప్రాంతాలకు చెందిన యువతకు ఎంతో సమీపంలోని ఈ గ్రౌండ్ నిరుపయోగంగా మారుతుంది. ఈ గ్రౌండ్‌ను శుభ్రపరిచి ఉపయోగంలోకి తెస్తే ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ఈ గ్రౌండ్ ప్రాంగణంలోనే వ్యాయామశాల ఉంది. అసలే వేసవి కాలం... కాస్త ఏదైనా పార్క్‌లో సేదతీరుదామంటే మెక్లోడ్‌గూడ, చుట్టాల బస్తీ, నల్లగుట్ట బస్తీవాసులకు సమీపంలో ఎటువంటి పార్కు లేదు. ఈ గ్రౌండ్‌ను అభివృద్ధిపరిచి చుట్టూ చెట్లు పెంచి. వాకింగ్ ట్రాక్‌ను అభివృద్ధిపరిచి, మధ్యలో క్రీడామైదానాన్ని ఏర్పాటు చేస్తే వృద్ధులకు, యువతకు, చిన్నారులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది. ప్రభుత్వం కానీ, ప్రజాప్రతినిధులు కానీ ఈ గ్రౌండ్‌ను పట్టించుకోవడంలేదు. ఈ గ్రౌండ్‌లో వాకింగ్ ట్రాక్ ఏర్పాటుకై 2019 నవంబర్‌లో నాటి మంత్రి, ప్రస్తుత సనత్‌నగర్ శాసన సభ్యులు తలసాని శ్రీనివాస్ యాదవ్ శిలాఫలకాన్ని ఏర్పాటు చేశారు. అందుకు తగినట్లు అధికారులు అభివృద్ధి పనులు మొదలు పెట్టినప్పటికీ నామ మాత్రంగా వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేసి, పచ్చదనాన్ని గాలికి వదిలి చేతులు దులుపుకున్నారు. దీనితో గ్రౌండ్ తిరిగి యధాతథ స్థితికి వచ్చింది. దీనికి తోడు మందుబాబులకు, గాంజాయి లాంటి మత్తుపదార్థాలు తీసుకునే వ్యసనపరులకు అడ్డాగా మారుతుంది.



మెక్లోడ్‌గూడ గ్రౌండ్



వాకింగ్ ట్రాక్‌పై బీరు సీసాలు

ఇప్పటికైనా అధికారులు, ప్రజాప్రతినిధులు ఈ గ్రౌండ్ అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని అందుకు తగిన చర్యలను చేపట్టాలని కోరుతున్నారు.

జీహెచ్ఎంసీ 2009లో ఓ ప్రైవేట్ వ్యక్తికి సమ్మర్ క్యాంప్ పేరిట గ్రౌండ్‌ను అప్పగించారు. ఆ వ్యక్తి ధనార్జనే లక్ష్యంగా 2013 వరకు అక్రమంగా క్యాంప్‌ను నడుపుతూ డబ్బులు సమకూర్చుకున్నాడు. ఈ విషయం తెలుసుకున్న జీహెచ్ఎంసీ స్పోర్ట్స్ డైరెక్టర్ ప్రేమ్‌రాజ్ డిసెంబర్ 13, 2013లో ఈ గ్రౌండ్‌ను స్వాధీనం చేసుకుని సీల్ వేశారు.

కాగా గ్రౌండ్‌లో అంతకుముందు ఎప్పటి నుంచో నడుస్తున్న వ్యాయామశాల కూడా మూతపడడంతో పలుమార్లు అధికారులకు విజ్ఞప్తి చేయగా వ్యాయామశాల తాళాలను ఇవ్వడం జరిగింది. కాలక్రమేణా స్థానికుల కోరికమేరకు నాటి మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ 2015లో అధునాతన జిమ్ కోసమని ఓ గది నిర్మాణం గావించి ప్రారంభించారు. కానీ నాటి నుంచి నేటి వరకు దాదాపు తొమ్మిది సంవత్సరాలు అందులో జిమ్ సామాగ్రిని మాత్రం ఏర్పాటు చేయలేదు.



వాకింగ్ ట్రాక్‌పై చెట్ల కొమ్మలు



2019లో వాకింగ్ ట్రాక్ కోసం వేసిన శిలాఫలకం

జిమ్ సామగ్రిని ఏర్పాటు చేయాలి



ఇటీవల కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి ఈ గ్రౌండ్‌లో పవర్ బోర్‌ను ప్రారంభించిన సందర్భంగా గ్రౌండ్‌లో త్వరలో ఓపెన్ జిమ్ ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. గ్రౌండ్ చుట్టూ సీసీ కెమేరాలను ఏర్పాటు చేయాలి. గ్రౌండ్‌లో ఫెన్సింగ్ ఉన్నప్పటికీ వెనుక ఉన్న స్కూల్‌లో నుంచి కొందరు మందుబాబులు వచ్చి మందు గంజాయి వంటి మత్తు పదార్థాలు తీసుకుంటున్నారు.

\- పులి మదన్, స్థానికుడు

ప్రభుత్వాలు మారుతున్నా గ్రౌండ్ స్థితి మారడం లేదు



ప్రభుత్వాలు మారుతున్నా గ్రౌండ్ స్థితి మారడంలేదు. శిలాఫలకాలు వేస్తున్నారు. పనులు తూతూ మంత్రంగా చేస్తున్నారు. సమీపంలో పిల్లలకు ఆట స్థలాలు లేక ఇబ్బందులు పడుతున్నారు. గ్రౌండ్‌లో క్రీడా పరికరాలు లేవు. నూతనంగా జిమ్ కోసం నిర్మించిన గదిలో అధునాతన జిమ్ సామాగ్రి లేదు. వాకింగ్ ట్రాక్ అసంపూర్తిగా మిగిలింది. గ్రౌండ్‌లో ఎటుచూసిన సమస్యలే. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇప్పటికైనా కళ్ళు తెరిచి గ్రౌండ్‌ను అభివృద్ధి పరచాలి.

\- శ్రీనివాస్ కుమార్, స్థానికుడు



రామకృష్ణను శాలువాతో సత్కరిస్తున్న సంఘ్ ప్రతినిధులు

దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయీస్ సంఘ్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా డీ.వీ.రామకృష్ణ

చిలకలగూడ, మే 15 (ఆంధ్రజ్యోతి): దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ వర్కింగ్ కమిటీ సభ్యుడిగా డీ.వీ.రామకృష్ణ ఏకగ్రీవంగా ఎనుకున్నారు. నేషనల్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ రైల్వేమెన్, దక్షిణమధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ ప్రధాన కార్యదర్శి మర్రి రాఘవయ్య ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన సంఘ్ 226వ వర్కింగ్ కమిటీ సమావేశంలో సికింద్రాబాద్, లోకో రన్నింగ్ స్టాఫ్ బ్రాంచి సెక్రటరీగా వున్న డీ.వీ.రామకృష్ణను వర్కింగ్ కమిటీ సభ్యుడిగా ఎన్నుకున్నారు. అనంతరం రామకృష్ణ మాట్లాడుతూ ఇచ్చిన బాధ్యతను నిస్వార్థంగా నిర్వహిస్తానని, కార్మిక శ్రేయస్సుకి, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని, బాధ్యత అప్పగించినందుకు జాయింట్ జనరల్ సెక్రటరీ భరణీ భానుప్రసాద్, సికింద్రాబాద్ డివిజనల్ సెక్రటరీ ప్రభురాజుకి ధన్యవాదాలు తెలిపారు. సంఘ్ ప్రతినిధులు రామకృష్ణను శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో కత్తితో ప్రయాణికుల్ని బెదిరిస్తున్న వ్యక్తి అరెస్టు

- కత్తి, నగదు స్వాధీనం
- నిందితుడిని పట్టుకున్న రైల్వే రుద్రమ్మ శక్తి టీం బృందం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్, మే 15 (ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఓ వ్యక్తి కత్తితో సంచరిస్తూ ప్రయాణికుల్ని బెదిరిస్తున్న నిందితుడిని రైల్వే రుద్రమ్మ శక్తి టీం బృందం పట్టుకుంది. సికింద్రాబాద్ ఆర్పీఎఫ్ ఎస్సై నసీమా తెలిపిన వివరాల ప్రకారం మహరాష్ట్రకు చెందిన సఫీ (30) సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఖాజీపేట్ వైపు ప్రాంతంలో బుధవారం ప్లాట్‌ఫాం నెంబరు1లో చార్మినార్ ఎక్స్‌ప్రెస్ వచ్చింది. ఆ సమయంలో సఫీ జేబులో కత్తి పెట్టుకుని సంచరిస్తూ ప్లాట్‌ఫాం పై నిర్మాణుష ప్రదేశంలో ప్రయాణికుల్ని బెదిరిస్తుండగా ఆ సమయంలో ప్లాట్ ఫాంపై రైల్వే రుద్మమ్మ శక్తి టీం మహిళా కానిస్టేబుళ్ల బృందం అతనిని అనుమానస్పదస్థితిలో అదుపులోకి తీసుకోని విచారించగా అతని జేబబులో రూ.3880 నగదు, పదునైన కత్తి ఉందని గ్రహించి నిందితుడిని అరెస్టు చేసి రిమాండుకు తరలించారు. జల్సా కోసం ప్రయాణికుల్ని బెదిరిస్తుండేవాడని తెలిపారు.



నిందితుడు సఫీ నుంచి స్వాధీనం చేసుకున్న నగదు, కత్తి

ఏపీలో టీడీపీ కార్యకర్తలపై దాడిచేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): ఓటమి తప్పదనే దుగ్ధతో వైసీపీ అరాచక శక్తులు పల్నాడు, తాడిపత్రిలో టీడీపీ అభ్యర్థుల ఇళ్లపై దాడి చేయడం అమానుషమని టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం అధ్యక్షుడు పి.సాయిబాబా అన్నారు. ఏపీలో టీడీపీ కార్యకర్తలు, సానుభూతిపరులు, అభిమానులపై దౌర్జన్యం చేయడం నికృష్టమైన చర్య అని అన్నారు. జైలులో ఉండాల్సిన ఈ అరాచక శక్తులు, రౌడీమూకలు వైఎస్ఆర్‌సీపీ పాలనలో ఆ పార్టీ కార్యకర్తలుగా చలామణి అవుతూ, సమాజంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తూ ఏపీని అరాచకప్రదేశ్‌గా తయారు చేసి దారుణ పరిస్థితికి దిగజార్చారని ఆరోపించారు. బుధవారం దోమలగూడలోని టీడీపీ నగర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఏపీ గవర్నర్ వెంటనే స్పందించి శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని కోరారు. వైసీపీ రౌడీలు, గుండాలను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో టీడీపీ సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం ప్రధాన కార్యదర్శులు నల్లెల కిషోర్, పి.బాల్‌రాజ్‌గౌడ్, ఎస్.ప్రకాష్, రాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పి. సాయిబాబా, చిత్రంలో నల్లెల కిషోర్, బాల్‌రాజ్‌గౌడ్ తదితరులు



సికింద్రాబాద్‌లోని రేతిఫైల్ బస్టాండ్

'జేబీఎస్‌కు వెళ్లే బస్సులు రేతిఫైల్ బస్టాండ్ వద్ద ఆపాలి'

రెజిమెంటల్‌బజార్, మే 15 (ఆంధ్రజ్యోతి): రేతిఫైల్ బస్టాండ్ మీదుగా జూబ్లీ బస్టాండ్ వెళ్లే బస్సులను రేతిఫైల్ బస్ కాంప్లెక్స్ వద్ద ఆపకపోవడం వలన ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. రేతిఫైల్ బస్ స్టేషన్ నుంచి బయలుదేరే బస్సులను ఎక్కాలనుకున్న ప్రయాణికులకు ఇబ్బందిగా మారింది. బస్సులు ఆపకపోవడం వలన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ముందు ఉన్న బస్ షెల్టర్‌లలో దిగి వెనుకకు రావలసి వస్తుంది. కొంత మంది రన్నింగ్‌లో దిగి ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇక్కడ బస్సులు అపడం వలన రైల్వే స్టేషన్‌కు వెళ్లే ప్రయాణికులు బస్సు దిగి నేరుగా ప్లాట్‌ఫామ్ ఒకటి మీదకు చేరుకునే అవకాశం ఉంది. అదేవిధంగా రేతిఫైల్ బస్ స్టేషన్‌లో దిగిన ప్రయాణికులు జూబ్లీ బస్టాండ్ వెళ్లడానికి, ఈస్ట్ మెట్రో స్టేషన్ వెళ్లడానికి సౌకర్యంగా ఉంటుంది.

రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలి

- ముఖ్యమంత్రికి ఆర్. కృష్ణయ్య లేఖ

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): బీసీల కులగణన చేసి పంచాయతీ, ఎంపీటీసీ, జెడ్‌పీటీసీ ఎన్నికల్లో 50 శాతం రిజర్వేషన్లు పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు. బుధవారం విద్యానగర్‌లో బీసీ భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యమంత్రికి రాసిన లేఖలోని వివరాలను వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మేనిఫెస్టోలో స్థానిక సంస్థల రిజర్వేషన్లు 22 శాతం నుంచి 42 శాతంకు పెంచుతామని ప్రకటించిందన్నారు. స్థానిక సంస్థల్లో బీసీ రిజర్వేషన్లు 50 శాతానికి పెంచిన తర్వాతే ఎన్నికలు నిర్వహించాలని, లేకపోతే ఆందోళన చేస్తామని కృష్ణయ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): ఫీడర్ మరమ్మతుల కారణంగా గురువారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు విజయభాస్కర్, ప్రేమానందపాయ్ తెలిపారు. ఉదయం 6.30 నుంచి 7 గంటల వరకు నల్లకుంట, పద్మాకాలనీ, మాతృశ్రీస్కూల్, అమర్ మెటర్నిటీ ఆస్పత్రి చుట్టుప్రక్కల ప్రాంతాల్లో, ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు బసంత్ కాలనీ పరిధిలోని లింగంపల్లి, విజయహాస్టల్, జైన్‌మందిర్, వెంకటరమణ థియేటర్, కాచిగూడ ప్రాంతాల్లో, ఏవీ కాలేజీ ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 8 గంటల వరకు, కవాడిగూడ స్ట్రీట్ నంబర్ 1 పరిధిలోని ప్రాంతాల్లో ఉదయం 7 నుంచి 7.30 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏడీఈలు పేర్కొన్నారు.

'ఫ్లాట్ల కొనుగోలులో అప్రమత్తంగా ఉండాలి'

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): అపార్ట్‌మెంట్‌లలో ఫ్లాట్‌ల కొనుగోలులో వినియోగదారులు అప్రమత్తంగా ఉండాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధానకార్యదర్శి సాంబరాజు చక్రపాణి కోరారు. బుధవారం సాయంత్రం గోల్కొండ చౌరస్తాలో మండలి రాష్ట్ర కార్యాలయంలో ఆయన మాట్లాడారు. వరంగల్ భద్రకాళి చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మాణం జరిగినవి, జరుగుతున్న ఫ్లాట్‌లను కొనుగోలు చేయడంలో జాగ్రత్తగా ఉండాలన్నారు. వరంగల్ భద్రకాళి చెరువు పరిరక్షణ విషయంలో వినియోగదారులమండలి ఇప్పటికే న్యాయస్థానాల్లో ఫిర్యాదులను దాఖలు చేసిందన్నారు. ఇటీవల బాచుపల్లి ప్రాంతంలో కోమటి కుంట చెరువును ఆక్రమించుకుని నిర్మాణం చేసిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై హైకోర్టు చెరువులో అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం తెలిపిందని పేర్కొన్నారు. ఈ విషయమై వినియోగదారులమండలిపక్షాన కేంద్ర వినియోగదారుల పరిరక్షణ అథారిటీకి ఫిర్యాదు చేసినట్లు ఆయన వివరించారు.

కైవల్య యర్రం శెట్టికి ఉగాది పురస్కారం ప్రదానం

చిక్కడపల్లి, మే 15 (ఆంధ్రజ్యోతి): కథక్ నృత్యకళాకారిణి కైవల్య యర్రం శెట్టికి ఉగాది పురస్కారం లభించింది. రసమయి సంస్థ ఆధ్వర్యంలో త్యాగరాయ గానసభలో మంగళవారం రాత్రి నిర్వహించిన ఉగాదిపురస్కారాల ప్రదానసభలో ప్రముఖ నాట్యగురువు పండిట్ అంజిబాబు శిష్యురాలైన కైవల్య యర్రంశెట్టి అద్భుతంగా కథక్ నృత్యాన్ని ప్రదర్శించారు. కైవల్యకు ఉగాది పురస్కారాన్ని హైకోర్టు పూర్వ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ బహూకరించిఆశీర్వదించారు.

అంబేడ్కర్‌నగర్‌లో వేసవి శిబిరం ప్రారంభం

రాంనగర్, మే 15 (ఆంధ్రజ్యోతి): సమ్మర్ క్యాంపులు చిన్నారుల్లో నైపుణ్యాన్ని వెలికితీసేందుకు దోహదపడతాయని బాగ్‌అంబర్‌పేట డివిజన్ మాజీ కార్పొరేటర్ కె.పద్మావతిడీపీరెడ్డి అన్నారు. బుధవారం అంబేడ్కర్‌నగర్ కమ్యూనిటీ హాల్‌లో సయోధ్య స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన సమ్మర్ క్యాంపును ఆమె ప్రారంభించారు.

నత్తనడకన ఓఆర్ఆర్ ఫేజ్-2 పనులు

- రియల్టర్లతో కుమ్మక్కు
- అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

హైదరాబాద్ సిటీ, మే 15 (ఆంధ్రజ్యోతి): ఔటర్ రింగ్‌రోడ్డు పరిధిలోని అన్ని ప్రాంతాలకు తాగునీరు అందించేందుకు వాటర్‌బోర్డు చేపట్టిన ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ప్రభుత్వ లక్ష్యాలకు భిన్నంగా, వాటర్‌బోర్డు నిర్ణయాలకు విరుద్ధంగా ఇష్టానుసారంగా పనులు చేపడుతున్నారు. రియల్టర్లతో కుమ్మక్కై శివారు ప్రాంతాల్లోని అక్రమ లేఅవుట్లలో కూడా పైపులైన్లు వేస్తున్నారు. గత ప్రభుత్వం ఔటర్ పరిధిలోని ప్రాంతాలకు తాగునీటిని అందించే బాధ్యతలను వాటర్‌బోర్డుకు అప్పగించింది. ఓఆర్ఆర్ ఫేజ్-1 ప్రాజెక్టులో భాగంగా రూ.756 కోట్లతో కొంతమేరకు పనులు పూర్తయ్యాయి. ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా రూ.1200 కోట్లతో మున్సిపాలిటీలు, కార్పొరేషన్లు, గ్రామ పంచాయతీలు, కాలనీలు, గేటెడ్ కమ్యూనిటీలకు తాగునీటి అందించే పనులను 2022లో ప్రారంభించారు. ఇందులో భాగంగా కొత్తగా 73 సర్వీసు రిజర్వాయర్లు (138 మిలియన్ లీటర్ల సామర్థ్యం), 2988 కిలోమీటర్ల మేర నూతన పైపులైన్ నిర్మించాల్సి ఉంటుంది. ప్యాకేజ్-1లో రూ.613.14 కోట్లతో 1571 కిలోమీటర్ల మేర కొత్తగా పైపులైన్ వేయడంతో పాటు 65.5 మిలియన్ లీటర్ల సామర్థ్యం కలిగిన 34 రిజర్వాయర్ల నిర్మాణం చేయాలని, ప్యాకేజ్-2లో రూ.586.86 కోట్లతో 1094 కిలోమీటర్ల మేర పైపులైన్ విస్తరణ, 36 రిజర్వాయర్లు నిర్మించాలని నిర్ణయించారు. గతేడాది డిసెంబర్ వరకు పనులు పూర్తిచేయాలని లక్ష్యాన్ని నిర్ణయించగా ఆరు నెలలు గడుస్తున్నా కనీసం 70 శాతం కూడా పూర్తవలేదు. పూర్తిస్థాయిలో సర్వీసు రిజర్వాయర్లు అందుబాటులోకి రాలేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టు పనులు నత్తనడకన సాగుతున్నాయి. ఎప్పటికి పూర్తవుతాయో అధికారులు సైతం స్పష్టత నివ్వడంలేదు. ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టులో 73 రిజర్వాయర్లకు 35మాత్రమే పూర్తిస్థాయిలో నిర్మాణం చేసినట్లు తెలిసింది. మిగతా 38 రిజర్వాయర్ల పనులు సాగుతున్నాయి. 90శాతం పూర్తయ్యాయని అధికారులు చెబుతున్నా ఇప్పట్లో అందుబాటులోకి వచ్చే పరిస్థితి లేదు. మొత్తం 2988 కిలోమీటర్ల పైపులైన్‌కుగానూ 2032 కిలోమీటర్ల నిర్మాణం పూర్తయింది. 956 కిలోమీటర్ల మేర పైపులైన్ నిర్మాణ పనులు చేపట్టాల్సి ఉంది. తాగునీటి సరఫరా పనులను సత్వరమే పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాల్సిన ఇంజనీరింగ్ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. పనులు పూర్తిచేయడానికి నిర్మాణ ఏజెన్సీలు నిర్లక్ష్యం వహిస్తున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



శివారులోని ఓ ప్రాంతంలో నిలిచిన పైపులైన్ పనులు

అక్రమ లేఅవుట్లలో పైపులైన్లు

ఓఆర్ఆర్ ఫేజ్-2లో భాగంగా శివారులోని ఏడు మున్సిపల్ కార్పొరేషన్లు, 18 మున్సిపాలిటీలు, 24 గ్రామ పంచాయతీల్లో 2988 కిలోమీటర్ల పైపులైన్ వేయాలని నిర్ణయించారు. ఇప్పటి వరకు 2150 కిలోమీటర్ల మేర పైపులైన్ మాత్రమే పూర్తిచేశారు. ఇంకా 800కు పైగా కిలోమీటర్ల పైపులైన్ వేయాల్సి ఉంది. ఇప్పటివరకు నిర్మాణం జరిగిన పైపులైన్ పనుల్లో భారీగా డొల్లతనం ఉన్నట్లు తెలిసింది. నివాసాలు కలిగిన ప్రాంతాల్లోనే పైపులైన్లు వేసి నీటిని అందించేవిధంగా చర్యలు తీసుకోవాల్సి ఉంది. అందుకు భిన్నంగా ప్రాజెక్టు విభాగంలోని కొందరు అధికారులు, ఏజెన్సీలు ఇష్టానుసారంగా వ్యవహరించినట్లు సమాచారం. ఆదిబట్ల మున్సిపాలిటీ పరిధిలో అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన ప్రైవేట్ లేఅవుట్‌లో ఇళ్లు లేకపోయినా పైపులైన్లు వేసినట్లు తెలిసింది. తుర్కయాంజల్ మున్సిపాలిటీ పరిధిలోని మన్నెగూడ ప్రాంతంలో లేఅవుట్ యజమానులకు మేలు చేసేలా పైపులైన్లు వేశారు. ఘట్‌కేసర్, కీసర, పటాన్‌చెరు, రామచంద్రాపురం మండలాల పరిధిలోని పలు ప్రాంతాల్లో రియల్టర్లతో కొందరు అధికారులు కుమ్మక్కై ఇష్టానుసారంగా పైపులైన్లు వేసినట్లు తెలిసింది. ఇటీవల ఏసీబీకి చిక్కకుండా తృటిలో తప్పించుకున్న వాటర్‌బోర్డులోని ఓ అధికారి కీలకంగా వ్యవహరించినట్లు సమాచారం. వాటర్‌బోర్డు ఎండీ మారడం, కొత్తగా మరో ఎండీ రావడంతో ఇదే అదనుగా భావించి ఎన్నికల సమయంలోనే ఈ తతంగాన్ని సాగించినట్లు తెలిసింది. కొత్తగా వచ్చిన ఎండీ ఓఆర్ఆర్ ఫేజ్-2 ప్రాజెక్టును పరిశీలన చేసేలోపు అక్రమాలు జరిగినట్లు బోర్డులో గుసగుసలు వినిపిస్తున్నాయి.